# ముఖాముఖం

కథ

డా॥వి. చంద్రశేఖర్ రావు




పేవ్‌మెంటు మీద నడుస్తూ, ఒక్కసారిగా ఎందుకో ఉలిక్కిపడింది మాలతి. చుట్టుపక్కల ఉన్న పరిసరాలన్నీ ఫ్రీజ్ అయి, వెనుక ఫొటోఫ్రేమ్‌లా నిలిచిపోతే తానొక్కతే అట్లా నడిచిపోతున్నట్లుగా అనిపించింది.

మే నెల ఎండ. షెల్టర్ల క్రింద, హోటళ్ళ ముంగిట గుంపులు గుంపులుగా నిలబడ్డారు జనం. సిటీ బస్సులు, ఒకటో అరాకార్లు తప్ప రోడ్డుపై పెద్దగా చలనం లేదు.

కదలికలేని చెట్ల ఆకులవైపు నిర్లిప్తంగా చూసుకుంటూ, ఇట్లా ఎండలో నడుచుకుంటూ వెళ్ళే కంటే, ఆటోలో వెళితే బాగుండు అనుకుంది. పర్సు తడుముకుంది. ఓ ఇరవై, మరికొన్ని చిల్లర ఉన్నట్టు గుర్తు. ఇప్పుడు ఆటో అంటే పదో, పదిహేనో ఖర్చు అవుతాయి. ఇట్లాగే నాలుగడుగులు వెయ్యగలిగితే బ్రిటిష్ లైబ్రరీ వస్తుంది. అక్కడ ఓ రెండు గంటలు గడిపి, కాస్త చల్ల బడ్డాక నడక సాగించవచ్చు. అనుకుంది. నాలుగు గంటలకు రిహార్సల్, తప్పక రమ్మంటూ బలవంత పెట్టాడు శివం. ఈ రిహార్సల్, ఈ నాటకాలు ఇవన్నీ ముగిసిన అధ్యాయాలు. తలుపులన్నీ మూసివేసుకొని, ఇంక ఇక్కడ ప్రదర్శనలు జరుగవు అని బోర్డు వ్రేలాడదీసుకొన్న స్టేజీ లా ఉంది మనసు. నేను రాలేను అంటున్నా శివం వినలేదు. కనీసం ప్రేక్షకురాలిగా రా అంటూ బలవంత పెట్టాడు.

RBI ని, AG ఆఫీసుని దాటుకొని అట్లా ముందుకు పోతే చౌరస్తాలో ఒక చిరపరిచితమైన దృశ్యం. హోమ్‌సైన్స్ కాలేజీ ఎదురుగా అమ్మాయిలు మూగి ఉన్నారు. ఈవ్వీక్లీ వాళ్ళు ఏర్పాటు చేస్తున్న బ్యూటీ కాంటెస్ట్‌ని బహిష్కరించమంటూ నినాదాలు యిస్తున్నారు. మొత్తం పదిహేను మంది కూడా ఉండరు. హోమ్‌సైన్సు కాలేజీ అమ్మాయిలు వింతగా చూస్తున్నారు గేటు దగ్గరే నిలబడి. రోడ్డుపై వెళ్ళే వాళ్ళకి కరపత్రాలు పంచుతూ నిలబడ్డ అమ్మాయి మాలతివైపు ఆసక్తిగా చూసింది. పోలికలు గుర్తుపట్టి పలకరించే లోపల గబగబా ముందుకు అడుగులు వేసింది మాలతి.

కొన్నాళ్ళక్రితం, ఇట్లాంటి ఉద్యమాలే జీవితంగా గడిపింది మాలతి. ఇప్పుడా ఉద్రేకం చల్లారిపోయింది. ఆ జీవితం, అనుభవాలు, అవితనవేనా అని విస్తుపోతుంది. కసిలాంటిదేదో ముప్పిరికొనగా తన జ్ఞాపకాల్లోంచి పీకేసుకుందా రోజుల్ని.

మలుపు తిరిగి సెక్రటేరియట్ రోడ్డు పైకి వచ్చింది. పేవ్‌మెంటు పొడవునా ఉన్న అశోకవృక్షపు నీడలు వింత ఓదార్పు నిచ్చాయి. ఏ పచ్చని చెట్టును చూసినా మాలతిలో సంచలనం, కలుగుతుంది. పరవశాన్ని కలిగించే సంగీతాన్ని వింటున్నట్లుగానో, బాల్యంలోకి పునఃప్రయాణిస్తున్నట్లుగానో, ఎండిన నాలుకపై అమ్మస్తన్యపు బొట్లు తటాలున రాలినట్లుగానో అనిపిస్తుంది. అన్ని అనుబంధాల్ని ఛేదించుకున్నా ఈ సెంటిమెంటును మాత్రం వదుల్చుకోలేకపోతుంది.

కొన్నాళ్ళక్రితం, ఇట్లాంటి ఉద్యమాలే జీవితంగా గడిపింది మాలతి. ఇప్పుడా ఉద్రేకం చల్లారిపోయింది. ఆ జీవితం,ఆ అనుభవాలు, అవి తనవేనా అని విస్తుపోతుంది. కసిలాంటిదేదో ముప్పిరికొనగా తన జ్ఞాపకాల్లోంచి పీకేసుకుందా రోజుల్ని.

టైమురెండు కావస్తుంది. ఇందాకటి గుంపులోంచి ఎవరో తనను పేరుపెట్టి పిలుస్తున్నట్లుగా తోచి, అడుగుల వేగాన్ని పెంచింది. పలాయనమా ? ఊహుకాదు. గట్టిగా సమాధానం చెప్పుకుంది.

బ్రిటీష్‌లైబ్రరీలో పెద్దగా సందడిలేదు. వద్దనుకుంటూనే పర్యావరణానికి సంబంధించిన పుస్తకం తీసుకుంది 'గ్రీన్‌ఎర్త్' బ్రిటన్ వాళ్ళ పర్యావరణ పత్రిక. అంతా సొల్లు. ఏసీ గదుల్లో కూర్చుని పర్యావరణం మీద థీసిస్‌లు రాస్తారు. ఒక చెట్టును నాటిన వాళ్ళకు, అడవుల విశృంఖలతను ప్రేమించలేని వాళ్ళకు పర్యావరణం గురించి మాట్లాడే హక్కులేదు. డామిట్! అంటూ పుస్తకాన్ని ముందుకు విసిరింది. శబ్దానికి అటూఇటూ ఉన్నముఖాలన్నీ ఆమెవైపు తిరిగాయి. ఇబ్బందిగా చూసి, అంతలోనే సర్దుకొని నవ్వు పొదురుగాక నాకేమి అనుకుంది. బరువైన ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాని తెచ్చుకొని 'దిట్రైబ్స్ ఆఫ్ ఇండియా' అనే అంశాన్ని వెతుక్కొని చదవటం మొదలుపెట్టింది.


"హలో!" పరిచయమైన గొంతు వినిపించి తలపైకెత్తింది. రాజు. మెడికల్ స్టూడెంటు. హలో చెప్పిం తరువాత అతనితో ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఈ హలో తరువాత మాటల్ని పెగల్చడానికి ఎంతో పెనుగులాడాల్సి వస్తుంది లోలోపల విసుగు. అట్లా అతను ఎదురుపడినందుకు, ఎదురు పడ్డ ఆ మనిషితో తను ఫ్రీగా మాట్లాడలేక పోతున్నందుకు.

"రండి! అట్లా సరోవర్ దాకా వెళ్ళి కాఫీ తాగివద్దాం ! అంటూ లేచాడు. అది అభ్యర్థనో, ఆజ్ఞో తేల్చుకోకుండానే అతని వెంట నడిచింది. 'ఎక్సర్‌సైజులు చేస్తున్నారా" అడిగాడు. "ఊ" అంటూ ఓ శబ్దాన్ని బయటకు విసిరింది. "వారం రోజులుగా ఫిజియోథెరఫీ యూనిట్ చుట్టూ తిరుగుతున్నాను. మీరు కనిపిస్తారేమోనని!" ఇతనెందుకు నా గురించి తిరగడం, ఇతని మాటల్లో ఇంత చనువెందుకు, మాలతికి చాలా అసహనంగా ఉంది. ఇతనే కాదు., ఈ వయసు మగవాళ్ళు చాల మంది యిట్లాగే. పది నిముషాలు ఒంటరిగా వాళ్ళతో గడిపితే, ఆ స్త్రీలమీద వాళ్ళకేవో హక్కులు వచ్చినట్లుగా భావించుకొంటారు. డామిట్ ! అనుకొంది మాలతి.

ఎండలో మిలమిల లాడుతుంది బిర్లా మందిర్. కొండపైనుండి ఠీవీగా, పొగరుగా కనిపిస్తుంది. ఆ పక్కనే ఉన్న కొండల నలుపు చూసి విసుక్కున్నట్లుగా ఉంది. పోలికను తల్చుకొని సన్నగా నవ్వుకొంది. వర్గమనస్తత్వం అంటే ఇదేనేమో అనుకుంది. "ఎందుకు నవుతున్నావు ?" అన్నాడతను "ఓహ్ ! ఈ నక్షత్రకుడు పక్కనున్న సంగతే మర్చిపోయాను" అనుకుంది లోలోపల.

మొహమాట పడకుండా అతను తెప్పించిన ఇడ్లీ, దోసె తినేసింది. కాఫీతాగుతుండగా, కళ్ళలోకి సూటిగా చూస్తూ "ఆరోజు మీరు అన్నది తమాషాకు కదూ!" అన్నాడు. అతని కళ్ళలో ఉన్నదేమిటి ? సందేహమా! భయమా ! అర్థం కాలేదు మాలతికి. సుమారు పదిహేను రోజుల క్రితం ఫిజియోథెరఫిలో. "రండి. మా రూమ్ చూద్దురుగానీ !" అంటూ ఆహ్వానించాడు. శరీరమంతా విపరీతమైన నొప్పులు. ప్రాక్చర్లపైని పిండి కట్లు తీసివేశాక స్టైఫ్‌నెస్ పెరిగి, ప్రతి కదలికా నొప్పిలోంచి పెనునొప్పిలోకి చేస్తున్న ప్రయాణంలా ఉంది. అంతకుముందు మూడునెలల క్రితం ఒకరాత్రివేళ స్పృహలేని స్థితిలో మాంసపు ముద్దలా ఉన్న తనను కాజువాలిటీ వార్డులో పడవేసి వెళ్ళిన క్షణం నుంచి, బహుశాదయతోనో, బహుశా వృత్తిపైన ఆరాధనతోనో, లేదా మరే తెలియని కారణం చేతనో అతను ఎంతో సాయం చేశాడు. "మీరు చాలా మొండి మనిషి ! అన్ని ప్రాక్చర్లయినా నిబ్బరంగా ఉండగలిగారు. మీరు మళ్ళనడుస్తుంటే ఫీనిక్స్ బర్డ్ గుర్తుకొస్తుంది " వార్డులో ఉన్నరెండు నెలలు అతనే తనకు బంధువు. డిశ్చార్జి చేసిన తరువాత కూడా రోజూ ఫిజియో థెరఫిస్టు దగ్గరకు తీసుకు వెళుతూఉండేవాడు.

హాస్పటల్‌పై అంతస్తులో ఉంది అతనిగది. పి.జిలు హౌస్‌సర్జన్లు ఉండే హాస్టలు. రూమ్ చూపిస్తాను అంటూ నన్ను వెంట తీసుకెళ్ళిన ఆసమయంలో ఆగది నిర్మానుష్యంగా ఉంది. ఇంగ్లీషు పాటేదో హమ్ చేస్తుంది స్టీరియో. క్రమంగా పలచనవుతున్న సాయంకాలపు వెలుతురు. పిరికిగా కంగారుగా గాడ్ ! అతని కళ్ళలో కోరిక. విరక్తిగానవ్వుకొంది మాలతి. ఇంతేనే మగవాడంటే అదే దిగులు ప్రశ్న ఉంది ఆనవ్వులో.




"మిమ్మల్ని నిరుత్సాహ పరుస్తున్నందుకు క్షమించండి. నాకు సిఫిలిసో, గనోరియానో, మీరు STD వ్యాధులంటారే వాటిలో కొన్ని ఉండే అవకాశముంది. అతని అంతరంగంలోని పెనువిస్ఫోటన అతని ముఖంలో స్పష్టంగా తెలుస్తుంది. తెల్లగా పాలిపోయి, భయంతో కొయ్యబారి "చెప్పకపోయినా బాగుండేది" అని జాలిపడింది మాలతి. "యూనో! ఐయామ్ ఏ రేప్ విక్టిమ్ !" ఆతరువాత వివరాలు చెప్పడానికి గొంతు పెగల్లేదు. జుగుప్సలాంటి, అసహ్యంలాంటి, కసిలాంటి ఏదో భావన ఉవ్వెత్తున లేచింది ఆమె మనసులో.

హోటల్ వాడు స్టీరియో ఆన్ చేశాడు. ఘజల్ ఏదో వినిపిస్తుంది. శ్రావ్యంగా. ఆ ఉర్దూపదాలకు అర్థం తెలియకపోయినా,, ఆ పదాల్ని తేనెలో ముంచి తినిపిస్తున్నంత హాయిగా గానం చేస్తున్నారెవరో. రాజు చేతిలో కాఫీకప్పుతో, సమాధానం కోసం ఎదురు చూస్తున్న ముఖంతో అలాగే చూస్తున్నాడు. మాలతికి సమాధానం చెప్పాలని పించలేదు. అతని ఆసక్తి ఎవరిపై ? నాపైనా ? నా శీలంపైనా ? అతన్ని పట్టించుకోవటం మానివేసి కళ్ళుమూసుకొని ఘజల్‌లోని శ్రావ్యతను ఆస్వాదించటం మొదలు పెట్టింది.

హోటల్ బయటికొచ్చాక మాలతి కెందుకో మనసు తేలికైనట్టుగా ఉంది. మబ్బుతునక ఒకటి ఆకాశంలో ముసిరి, నగరంపై పెద్దగొడుగేదో విప్పుకున్నట్లుగా ఉంది. సూర్యతాపంకాస్త తగ్గింది. అట్లా టాంక్ బండ్ దాకా నడిచివెళ్ళి ఏవేమన నీడలోనో, శ్రీశ్రీనీడలోనో కూలబడి, సంఘటనల్ని తాత్వికధోరణిలోనో, మార్క్సిస్టు ధోరణిలోనో నమీక్షించకుంటూంటే ఎంత బాగుంటుందో అనిపించింది. కానీ ఈ పక్క నున్న మనిషికి కాముకధోరణి తప్ప మరోటి తెలిసినట్లు లేదు.

"ఎండ తగ్గినట్లుంది! రండి టాంక్ బండ్ వైపు వెల్దాం !" అంటూ ముందుకు అడుగువేశాడు. వెళ్ళాలని కోరికున్నా, అతని గిరీశం మార్కు చూపుల్ని తప్పించుకోడానికి "సారీ అండి ! నాలుక్కు నాకురిహార్సులుంది ! నేనిట్లా సెంట్రల్ యూనివర్సిటీ వైపు వెళ్తాను. థాంక్యూ ఫర్‌ది కంపెనీ !" అంటూ చకచకా అడుగు లేసుకుంటూ ముందుకు సాగింది మాలతి.

పేవ్‌మెంటు పొడవునా కాన్వెంటు పిల్లలు. అప్పుడే స్కూళ్ళు వదిలి నట్లున్నారు. అల్లరి చేసుకుంటూ, హడావుడిగా పరిగెత్తుతున్నట్లుగా వడుస్తూ, నీలిరంగు నదీ ప్రవాహమేదో పక్కనే ప్రవహిస్తున్నట్లుగా ఉంది మాలతికి. మాలతిని తోసుకుంటూ ముందుకు వెళ్ళిన ఒకపాప వెనక్కుతిరిగి "ఎక్స్‌క్యూజ్‌మి ఆంటీ !' అంటూ కొంటెగా నవ్వింది. మాలతికి తన యూనివర్సిటీ రోజులు గుర్తుకొచ్చాయి. సిటీ బస్సుల కోసం హడావుడిగా పరుగులెత్తటం. తనుదిగే చోటువచ్చేదాకా పక్కవాళ్ళతో ఏదో విషయంగురించి చర్చిస్తూనో వాదిస్తూనో గడిపేది. శివం అంటూండేవాడు "నువ్వు పక్కనున్నంతసేపూ స్వేచ్ఛావాయువేదో ప్రసరించినట్లుగా ఉంటుంది. తనదైన నాటకీయమైన ధోరణిలో. స్టూడెంట్స్ గ్రూప్ ఫర్ ఎన్విరాన్ మెంటు ప్రొటెక్షన్" అంటూ పర్యావరణ రక్షణగురించి ఒక వేదిక యూనివర్సిటీలో మొదలుపెట్టింది తనే. ఆ మీటింగుల్లో మాట్లాడుతూ శివం "మాలతిని మన మింక ముద్దుగా మేధా పాట్కర్ అని పిలుచుకుందాం"! అంటూ గొప్ప కాంప్లిమెంటు నిచ్చాడు. రీసెర్చిని మధ్యలో వదిలేసి 'ఫోకస్' సంస్థలో చేరాలనుకున్నప్పుడు, అందరూ నిరుత్సాహపరిచినా శివం ఒక్కడే తనను ప్రోత్సహించాడు. అజ్ఞాపకాలన్నీ గుర్తుకొచ్చి, అంతట్లోనే వెనుదిరిగి అమెను ఆవహించింది. అజ్ఞాపకాలన్నీ తనవి కానట్లుగా - అపరిచితంగా మారాయి.

"ఏయ్ మాలతి !" అనే పిలుపువిని, వెనక్కు తిరిగింది. ఏరిండియా ఆఫీసు ముందు నిలబడి కేక వేస్తుంది, సుజాత. సుజాత పత్రికాఫీసులో సబ్ ఎడిటర్, కవయిత్రి. ఫెమినిస్ట్ ఉద్యమకర్త. మాలతి దగ్గరకు రాగానే గొప్ప ఉద్వేగంతో మాలతిని కౌగలించుకొని "ఏమిట్రాయిది. ఎందుకిట్లా జరిగింది ఇంతటార్చర్, ఇంత దుఃఖం, ఇంత బాధ ఎట్లా ఓర్చుకున్నావు ? నాతల్లీ ! ఎందుకురానీకీ శిక్ష ! " అంటూ పెద్దపెట్టున ఏడ్చింది. చుట్టుపక్కల ఉన్న పరిసరాలు, మనుషులు మాయమై, ప్రపంచమంతా ఆయిఇద్దరు స్త్రీలే అన్నట్లుగా ఒకళ్ళనొకళ్ళు కౌగిలించుకొని, ఒకానొక దుర్భరమైన సంఘటన తాలూకు బాధను పరస్పరం అనుభవిస్తూ అట్లా ఎంతసేపు గడిపారో వాళ్ళకే తెలియదు. తేరుకున్నాక అటు పక్కనున్న ఏరిండియా ఆఫీసు మెట్లపై కూలబడ్డారు. మాలతి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని ప్రేమగా నిమురుతుంది సుజాత. ఆ స్పర్శలో ఓదార్పు, అమ్మతనం తోచాయి మాలతికి.

"శివం చెప్పేదాకా మాకెవరికీ తెలియదు. ఆ బాస్టర్డ్‌మీడైరెక్టరు గొప్పగా మానేజ్ చేశాడు. పేపరు వాళ్ళని, పోలీసుల్ని, అధికార్లని అందర్నీ కొనేసినట్టున్నాడు, కానీ వాణ్ణి వదలడానికి వీల్లేదు. వాణ్ణీ, వాడి సంస్థని, పేపర్లొకెక్కిస్తాను. వాడి అంతు చూసేదాకా నిద్రపోను. శివం యూనివర్సిటీ స్టూడెంట్లనీ, మిగతా వాలంటరీ ఆర్గనైజేషన్ వాళ్ళను మొబలైజ్ చేస్తున్నాడట" కోపతీవ్రతలో సుజాత ముఖం అదిరిపోతుంది. "నువ్విక్కడ ఒక్కదానివే హస్టల్‌లో ఎందుకు ? ఇంటికి వెళ్ళకూడదూ ? ఆ హాస్పటల్‌లో అన్నాళ్ళు దిక్కులేని దానిలా పడిఉన్నావట !అమ్మకు కబురు చేస్తే బాగుండేది ?

"ఫోకస్‌లో చేరినప్పటి నుండి అమ్మా నాన్నా ముభావంగా ఉంటున్నారు. ఇప్పుడీ సంగతి తెలిస్తే చెపితే వినలేదుగా ! చూడు ఏవయిందో?" అంటూ విసిగిస్తారు. ఆ నిరసనలు, నిష్ఠూరాలు వినటం యిష్టం లేక హస్టల్‌లోనే ఉన్నాను.

వాళ్ళిద్దరూ అట్లా మాట్లాడుకుంటానే ఉన్నారు. A.G ఆఫీసులోంచి గుంపులు గుంపులుగా ఉద్యోగులు బయటకు రావటం మొదలుపెట్టారు. వంద పంజరాలన్నీ ఒక్కసారిగా తెరుచుకున్నట్లుగా. రోడ్డంతా కిక్కిరిసి పోయింది. అప్పటికి వాతావరణం కాస్త చల్లబడింది. సుజాత లేచి" వెళ్తానిక! నిజానికి నీపని మీదే తిరుగుతున్నాను. ఆ ఫోకస్ వాళ్ళమీద ఒక స్కూప్ వేద్దామంటే మా ఎడిటరు ఒప్పుకొని చావటంలా. ప్రొప్రయిటర్ని

అడిగితే ఆరింటికి అప్పాయింట్‌మెంటు ఇచ్చాడు. ఆయన్ను ఎట్లాగయినా ఒప్పించాలని బయల్దేరాను." అంటూ జనప్రవాహాన్ని చీల్చుకుంటూ లకిడీకాపూల్ వైపు బయల్దేరింది. సెంట్రల్ యూనివర్సిటీ వైపు అడుగులు వేసింది మాలతి.

యూనివర్సిటీ దగ్గరవుతుండగానే సంగీత పరికరాల చప్పుళ్ళు రిథమిక్‌గా, హాయిగా చెవిన బడ్డాయి మాలతికి. కంజెర, డప్పు, గజ్జలు అతి మామూలు పరికరాలు. ఒకనొక ప్రాదేశిక జీవనాన్ని నగరంలోకి దిగివచ్చిన భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఆపరికరాల చప్పుళ్ళు వాటికి తోడుగా అర్థంకాని తాత్వికత వినిపిస్తుంది. వేణువు. యూనివర్సిటీ గేటు ముందో పెద్ద సమూహం. స్టూడెంట్లు, జర్నలిస్టులు కవులు, రచయితలు, శివం ప్రత్యేకంగా పిలిపించిన ఆహుతులు. ఆవాళ్టి స్ట్రీట్‌ప్లే కోసం ఓపాతిక మంది దాకా యువతీయువకులు కొద్దిపాటి మేకప్‌తో ఆహుతుల మధ్య అటూ ఇటూ తిరుగుతున్నారు. స్ట్రీట్ ప్లేని సృష్టించటంలో దిట్ట శివం. జీవితంలోంచి ఒక దృశ్యాన్ని కత్తిరించి మన ముందుంచినట్లుగా, సహజంగా సాగిపోయే సంఘటనలలా ఉంటాయి అతని నాటకాలు.

"రా! నీకోసమే ఎదురు చూస్తున్నాం!" అంటూ ఆహ్వానించాడు శివం. మాలతికి తాను మళ్ళీ నటించగలనా అని సందేహం! "శివం! మనసంతా బోలుగా, ఖాళీగా ఉంది. నాముఖంలో ఇక భావాలు పలుకుతాయా? వద్దు శివం! ఈ సారికి నన్నొదిలెయ్యి!" అంది దీనంగా. "ఈనాటకంలో నువ్వుండి తీరాలి! ఈ ఒక్కసారికి కాదనకు. మళ్ళీ ఇంకెప్పుడూ నిన్ను విసిగించను." అంటూ స్క్రిప్టు చేతికందించి, మిగిలిన పాత్రధారులవైపు వెళ్ళాడు శివం.

> యూనివర్సిటీ దగ్గరవుతుండగానే సంగీత పరికరాల చప్పుళ్ళు రిథమిక్‌గా, హాయిగా చెవిన బడ్డాయి మాలతికి. కంజెర, డప్పు, నగరంలోకి దిగివచ్చిన భ్రాంతిని కలిగిస్తున్నాయి.

స్క్రిప్టు చదివి కొయ్యబారిపోయింది మాలతి. అది తన కథ తగలబడుతున్న అరణ్యాలకథ. డబ్బుకు, రాజకీయాలకు అమ్ముడుపోయిన స్వచ్ఛంద సంస్థల కథ. బుల్‌డోజర్లతో భూమినీ, భూమిపుత్రుల్ని బలవంతంగా వేరు చేసిన కథ. ఎదిరించిన పురుషులను చిత్రహింసలపాలుచేసి, స్త్రీలను అమానుషంగా చెరిచిన కిరాతకుల కథ. "అయ్యో శివం! ఎందుకిట్లా చేశావు! మానిందను కున్నపుండును ఎందుకు మళ్ళీ రేపుతున్నావు?" స్క్రిప్టు కాగితాల్ని అట్లాగే విసిరి బయటకు పరుగెత్తాలనే కోరిక కలిగింది మాలతికి. లేచి, శివం వైపు అడుగులేస్తుండగానే మొదటిరంగం మొదలైంది.

రాజకీయనాయకులు, ఫారెస్టు అధికార్లు, స్వచ్ఛంధ సంస్థల కార్యకర్తలు అటునుంచి ఇటు, ఇటునుంచి అటు నడుస్తూ గొప్ప ఆలోచనాముద్రను అభినయిస్తుంటారు. బ్యాక్‌గౌండ్‌లోంచి భారతదేశపు అడవుల గురించిన సంఖ్యలు, వివరాలు వినిపిస్తూ ఉంటాయి. కూలిపడుతున్న చెట్ల చప్పుళ్ళు, పెళ్, పెళ్ మని వినిపిస్తున్న గొడ్డళ్ళ చప్పుళ్ళు నేపధ్య సంగీతంగా వినిపిస్తుంటాయి. "ఒక మహావిపత్తునుండి ఈ దేశాన్ని రక్షించడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాము. మనం కొన్ని కఠినమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సిఉంది. భవిష్యత్తుకోసం, ముందు తరాల వాళ్ళకోసం, భారతదేశంచిత్రపటం నుండి పచ్చదనం మాయమై పోకుండా ఉండటంకోసం మనమీ నిర్ణయాన్ని తీసుకుంటున్నాము. చిన్నమెట్ల అడవుల్ని రిజర్వ్‌డ్ ఫారెస్టుగా ప్రకటిస్తున్నాము. అదిక మీదట రక్షిత ప్రాంతం. చిన్న రెమ్మను కూడా అక్కణ్ణుంచి గిల్లడానికి వీల్లేదు." అంటూ తీర్మానం వినిపిస్తుంటుంది. ఫారెస్టు అధికార్లు, N.G.Oలు చప్పట్లు కొడుతుంటారు. పర్యావరణ రక్షణే మాలక్ష్యం" అంటూ ఫారెస్టు అధికార్లు పిడికిలి బిగించి మార్చింగ్ చేస్తుంటారు.

శుష్కించిన శరీరాల్తో, ఖాళీ చూపులతో పల్లెల్లోని గిరిజనులు పోలోమంటూ స్టేజి పైకి వస్తారు. "మీకు స్థలాలిస్తాం! అడవులకు దూరంగా భూముల్ని కేటాయిస్తాం! ఋణాలిప్పిస్తాం! భయంవద్దు! భయంవద్దు!" హామీలిస్తుంటాడో నాయకుడు. అపనమ్మకంతో, ముఖాల్లో వింత వింత భయాలతో వాళ్ళు వెనక్కు వెనక్కు వెళ్ళు తుంటారు. అదే సమయంలో గిరిజను స్త్రీ తలపైనున్న కట్టెల మోపుల్ని కిందకు లాగివేస్తుంటాడో ఫారెస్టు అధికారి. మరొకరు పురుషుల చేతుల్లోంచి చింతపండు మూటల్ని లాగివేస్తుండగా మొదటి రంగం ముగుస్తుంది.

ఆ దృశ్యం ఎంత సహజంగా వచ్చిందంటే మాలతికి తెలియకుండానే అందులో లీనమైంది. లోపలగాయం, మరుగుతున్న కన్నీళ్ళు క్షణం పాటు మరిచిపోయింది. ఉత్తేజితమైన నటిగా రూపాంతరం చెందింది. శివం ఈ మెటామార్ఫసిస్ నంతటినీ గమనిస్తూనే ఉన్నాడు.

రెండవరంగం మొదలైంది. అడవుల మధ్య పెళ పెళ మంటూ మంటలు లేస్తాయి. పక్షులు జంతువులు భయ విహ్వలతలో పరిగెత్తటం కనిపిస్తుంది. కోపంగా కంద గడ్డలైన ముఖాల్తో ఫారెస్ట్ అధికార్లు. FIR కాగితాల్తో లాఠీలతో పోలీసులు వాళ్లను చుట్టుముట్టుతారు. ఫోకస్ అవే బ్యానర్ ముందు పెట్టుకొని ఒక పదిమంది వాళ్ళ మధ్యకు వస్తారు.

సూటు, హాటు, కళ్ళజోడు, యాంకీభాషతో T.K.రావు ఉపన్యాసం చెబుతున్నవాడిలా ముందుకొస్తాడు. "హింసద్వారా మనుషుల్ని మార్చటం అనేది ఇంతవరకు చరిత్రలో ఎక్కడా జరగలేదు. మాకో అవకాశం ఇవ్వండి. ఈ గిరిజనుల్ని మాప్రేమతో, సేవలతో మారుస్తాం! రాజ్యహింస, రాజ్యేతర హింస ఏదీ యిక్కడ కనబడటానికి వీల్లేదు. అందరూ వెళ్ళిపొండి!" క్రమంగా ఫారెస్టు అధికార్లు . పోలీసులు బ్యాక్‌గ్రౌండ్‌లోకి వెళతారు. "లక్ష్మి వీళ్ళకో రాత్రిబడి ఏర్పాటు చెయ్యి. ప్రభాకరం! వీళ్ళకు ఋణాలు అందే సదుపాయం ఏర్పాటు చెయ్యి! రాజారావు! సూదులు, స్టెతస్కోపులు, మందులతో సంచార వైద్యశాలను ఏర్పాటు చెయ్యి! మాలతీ! వీళ్ళ కోసం ఒక రంగస్థలిని ఏర్పాటు చెయ్యి! కళ మనోవికాసానికి దోహదం చేస్తుంది." ఫోకస్ కార్యకర్తలు గిరిజనుల్తో కలిసి కొత్త జీవితాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యాల్తో ఆరంగం ముగుస్తుంది. మాలతి ఒక్కటె కంజెర వాయిస్తూ జానపదగీతం హమ్ చేస్తూ ఉంటుంది.. గిరిజన స్త్రీలు ఆమెపాటను అనుసరించి నాట్యం చేస్తుంటారు. వెనుక నుండి మళ్ళీ మంటలు

లేస్తున్న దృశ్యం. జనం భయంతో అటూ ఇటూ పరిగెడుతుంటారు:

రెండోరంగం ముగిసేసరికి మాలతి చాలా ఉద్వేగంగా మారిపోయింది . జరిగిపోయిన సంఘటనల్లోకి మళ్ళీ ప్రయాణించటము సరికొత్త అనుభవం. మాలతిలో వింత సంచలనం జరుగుతుంది. శివం నిజానికి నాటకాన్ని దర్శకత్వం వహించటం మానేసి మాలతిలో జరిగే అంతర్మధనాన్ని గమనిస్తున్నాడు.

అప్పటికి బాగా చీకటి పడింది. యూనివర్శిటీ గేటుకు రెండువైపుల నున్న ఫ్లడ్ లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. బయట రోడ్లపై వాహనాల సంచారం తగ్గినట్లుంది. చప్పుడు చెయ్యని ప్రేక్షకుల్లా ఉన్నాయి రోడ్లు. టైమ్‌మిషన్‌లోకి వెళ్ళిన మనిషిలా మాలతి వింత అర్లవంలోకి వెళ్ళిపోయింది.

మూడవ రంగం మొదలైంది. ఈ రంగంలో మాలతే ప్రధాన పాత్ర. పర్యావరణ రక్షణ సమితి అనే బ్యానర్ ఎగురుతూ ఉంటుంది. నాయకులు, అధికార్లు, పోలీసులు ఫోకస్ కార్యకర్తలు సమావేశపు భంగిమలో నిలబడి ఉంటారు. ఆలోచనా ముద్రను అభినయిస్తూ అటూ ఇటూ తిరుగుతుంటారు. మాలతి రౌద్రమూర్తిలా ప్రత్యక్షం అవుతుంది. "ఇదంతా కుట్ర. స్మగ్లర్లు కలప వ్యాపారస్థులు స్థానిక రాజకీయ నాయకులు చేస్తున్నకుట్ర. ఇది గిరిజనులే చేస్తున్నారని ప్రజల్ని, ప్రభుత్వాన్ని భ్రమపెట్టి మళ్ళీ ఈ అడవుల్ని డీ రిజర్వు చేయించాలని వీళ్ళ ప్రయత్నం. ఆ తరువాత యధేచ్ఛగా అడవుల్ని తెగనమ్ముకోవాలనీ వీళ్ళ దురాలోచన". మాలతి మాట్లాడుతుండగా. ఆమెను పదే పదే వారిస్తుంటాడు T.K. రావు. "షి యీజ్ యంగ్, ఇమ్మెచ్యూర్, యూనివర్శిటీల్లోంచి ఫ్రెష్‌గా ఇటువచ్చింది. విషయ పరిజ్ఞానం తక్కువ. ఆమె మాటల్ని పట్టించుకోకండి!" వాద ప్రతివాదాలు, చర్చలు హోరాహోరీగా సాగుతుంటాయి. అంతాగందరగోళంగా ఉంటుంది. ఈ గందరగోళంలోంచి ఒకనాయకుడు లేచి ఇక లాభం లేదు. కఠినమైన నిర్ణయాలు తీసుకోక తప్పదు. బలవంతాన గిరిజనుల్ని అక్కడనుంచి ఖాళీ చేయించండి!" అంటూ హిట్లరు మార్కు పోజులో అరుస్తాడు.

చిట్ట చివరి రంగం. మాలతి కెందుకో క్షణం పాటు జలదరింపు కలిగింది. మెదడో పోలరాయిడ్ కెమెరా లా అయిపోయి ఆనాటి సంఘటనలన్నీ చిత్రాలుగా బయటకువస్తున్నాయి. ఢమఢమ మంటూ బుల్‌డోజర్లు. లారీల్లోంచి కిరాయి రౌడీలు. ఒక ఆర్తనాదం. పలుగొంతుకలు బాధాతీవ్రతలో మొరపెట్టుకోవటం. అటూ ఇటూ ఒకళ్ళనొకళ్ళు తొక్కుకుంటూ ప్రాణభీతితో పరిగెత్తటం. తన శరీరంపై పర్ణ మొరట చెయ్యి. జుట్టు పట్టుకొని పొద మధ్యకు ఈడ్చుకెళ్ళటం. అప్పటి దాకా అంతటా చీకటే. హింస రంగు చీకటి కాబోలు అనుకొంది. కానీ అంతలోనే భగ్గుమంటూ పైకిలేచాయి మంటలు. గుడెసెల్లోంచి లేచిన మంటలు, మంటలసాక్షిగా, తన శరీరాన్ని కరుస్తున్న రక్కసి ముళ్ల సాక్షిగా ఒకడు కాదు, ఇద్దరు కాదు పదిమంది వరుసగా తన శరీరంపై దాడి చెయ్యటం. "అన్నా చచ్చిపోతానన్నా! వదిలేయన్నా!" అంటూ పన్నెండేళ్ళ బాలిక ఆపక్కపొదలోంచి వేడుకోవటం తన చెవుల్లో పడుతుంది. అట్లా అరిచే శక్తికూడా తను కోల్పోయింది.

అవన్నీ గుర్తుకొచ్చి మాలతి ముఖం మ్లానమైంది. కళ్ళలో నీళ్ళు. మాలతి భుజంపై వెచ్చని స్పర్శ ఏదో తోచి వెనక్కు తిరిగింది. శివం. శివం కళ్ళలో అనురాగం. అమృత నం. శివం ఏం మాట్లాడలేదు. కానీ ఆరాత్రిపూట ఫ్లడ్ లైటు వెలుగులో శివం కళ్ళలోని జీవభాషను మాలతి చదవగలిగింది. మాలతిలో మళ్ళీ ఉత్తేజం రాజుకుంది.

బయట రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. రెండు ఉజ్వల నేత్రాల్లా ఫ్లడ్ లైట్లు వెలుగుతున్నాయి. చిట్ట చివరి రంగం కోసం ప్రేక్షకులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

స్క్రిప్టు నొకసారి చదువుకొని స్టేజీపైకి వచ్చింది మాలతి.

( ఆకాశవాణి, విజయవాడ సౌజన్యంతో)

